కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 80, దొండ 60, దోస 40, ఆలు 25, చామ 50, కీర 30, బీర 70, వంకాయ 50, గోకర 70, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 250.

గచ్చిబౌలిలో 74 .. రాయదుర్గంలో 45 కేసులు



తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గచ్చిబౌలి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి గచ్చిబౌలి, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు.ఈ సందర్భంగా 119 కేసులను నమోదు చేశారు. అందులో గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 74 కేసులు నమోదు చేయగా, రాయదుర్గం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 45 కేసులను నమోదు చేసినట్లు ట్రాఫిక్ అధికారులు వివరించారు.

భారీగా కేసులు నమోదు

హఫీజ్‌పేట్: మియాపూర్, చందానగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాని సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చందానగర్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 104 కేసులు నమోదు అయ్యాయని, మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 150 కేసులు నమోదు చేశామన్నారు. సీఐలు పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త ఏడాది.. కొత్త లక్ష్యాలతో

ఇదీ అధికారుల మనోగతం

రాయదుర్గం: కొత్త ఏడాది ఆరంభం కావడంతో అందరూ మొదటిరోజు నుంచే కొత్త ఏడాది లక్ష్య సాధనకు తగిన ప్రణాళికలను రూపొందించుకొని సాగేందుకు నిర్ణయం తీసుకున్నారు. వాటి అమలు, లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలని భావిస్తున్న నేపథ్యం లో వారంతా విజయం సాధించాలని భావిద్దాం. గచ్చిబౌలి డివిజన్‌లోని వివిధ రంగాలకు చెందిన వారు తమ మనోగతాన్ని వెల్లడించారు. వారి మాటల్లోనే..

పోటీ పరీక్షలకు అనుగుణంగా సిలబస్



పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రత్యేకంగా సిలబస్ రూపొందించాలని భావిస్తున్నాం. ప్రస్తుత కోర్సులను కొనసాగిస్తూనే ఉపాధి ఆధారిత కోర్సుల కోసం చర్యలు చేపట్టాలని నిర్ణయించాం. ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేస్తాం. విద్యార్థులలో ఆత్మవిశ్వాసంపెరిగే లా చర్యలు తీసుకుంటాం. అస్తవ్యస్తంగా ఉన్న తెలుగు విభాగాన్ని ఇప్పుడిప్పుడే పూర్తిగా మార్చివేశాం. ఫ్యాకల్టీ, ఉన్నతాధికారులు ముఖ్యంగా వైస్‌చాన్స్‌లర్, రిజిస్ట్రార్, డీన్‌ల సహకారంతో యూనివర్సిటీలోనే తెలుగు విభాగానికి ఒక ప్రత్యేకత సాధించేలా చేస్తాం.

– ఆచార్య దార్లవెంకటేశ్వరరావు, తెలుగు విభాగాధిపతి, హెచ్‌సీయూ

గ్రామాలను దత్తత తీసుకుంటాం



హెచ్‌సీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ద్వారా గ్రామాలను దత్తత తీసుకొని సర్వేలు చేసి, అభివృద్ధిలో వాలంటీర్లను భాగస్వామ్యం చేస్తాం. క్యాంప్ ఏర్పాటు చేసిన చోట వాలంటీర్లు విద్య, వైద్య సౌకర్యాలు, స్థానికుల అవసరాలపై సర్వే చేస్తారు. గ్రామ అభివృద్ధిలో ముఖ్యంగా శానిటేషన్, నిర్మాణ పనుల్లో వాలంటీర్లు భాగస్వాములను చేసేలా చూస్తాం.హెచ్‌సీయూలో ఈ ఏడాది కూడా క్లీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించాం. అంతేకాకుండా నేషనల్ యూత్ ఫెస్టివల్, నేషనల్ ఇంటిగ్రేషన్ ప్రోగ్రామ్‌లో మా వాలంటీర్లు పాల్గొనేలా వారిని ప్రోత్సహిస్తాం.

– ఆచార్య కృష్ణయ్య, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్, హెచ్‌సీయూ

‘ఎస్కీ’లో స్టార్టప్ కల్చర్ అభివృద్ధి చేస్తాం



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 2024లో ‘ఎస్కీ టెక్నో హబ్ ఏర్పాటు చేసి స్టార్టప్ కల్చర్‌ను అభివృద్ధి చేస్తాం. ఇంక్యుబేషన్ సెంటర్, వర్కింగ్ స్పేస్‌లను అందుబాటులోకి తీసుకొస్తాం.ఈ ఏడాది అత్యధికంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. ఎస్కీలోని స్కూల్ ఆఫ్ పోస్టుగాడ్యుయేట్ స్టడీస్‌లో స్థానికులకు ఎక్కువ సీట్లు సాధించేలా చేసి వారికి చదువు పూర్తికాగానే ఉపాధి నైపుణ్యాలను నేర్చుకునేలా చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది మార్చిలో ‘ఎస్కీ కన్వెన్షన్ సెంటర్’ను అందుబాటులోకి తీసుకొస్తాం. ఏఐసీటీఈ, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో కొత్త కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకున్నాం.

– డాక్టర్ జి రామేశ్వరరావు, డైరెక్టర్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, గచ్చిబౌలి

200 మెడికల్, 30 ఐఐటీ, 20 ఎన్ఐటీ సీట్ల సాధనే లక్ష్యం..



ఈ ఏడాది సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల గౌలిదొడ్డి నుంచి 200 మెడికల్, 30 ఐఐటీ, 20 ఎన్ఐటీలో సీట్లు సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. అదేవిధంగా ముగ్గురినైనా కనీసం అమెరికాకు పంపించి ఉన్నత చదువులు చదివేలా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అందులో మా విద్యార్థులే ఉండేలా చూస్తాం. ప్రస్తుతం మా కళాశాలలో 300 మంది నీట్‌లో 100 ఐఐటీలో శిక్షణ పొందుతున్నారు. జాతీయ స్థాయి పోటీలు కావడంతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఉన్నతాధికారులు, ఫ్యాకల్టీ, తల్లిదండ్రుల సహకారంతో ఈ లక్ష్యాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– శారద, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక కళాశాల

నిరుద్యోగులకు ఉపాధి స్వల్పకాలిక కోర్సులు



నిరుద్యోగులకు స్వల్పకాలిక కోర్సులు ఏర్పాటు చేయాలని సంకల్పించాం. మూడు, ఆరునెలల కోర్సులను లెదర్ టెక్నాలజీ, ఫుట్‌వేర్ టెక్నాలజీలో ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం ఏఐసీటీఈ గుర్తింపు ఉంది, ప్రతియేటా రెన్యూవల్ చేస్తున్నాం. ఈ ఏడాది నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు సాధించాలన్నదే లక్ష్యం. ఈ గుర్తింపు వస్తే జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో మా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు స్థానం లభించేలా చేస్తాం. రూ.25 లక్షలతో క్వాలిటీ కంట్రోల్ ఎక్విప్‌మెంట్ తీసుకొచ్చాం. దీని ద్వారా చిన్నచిన్న సంస్థలలో లెదర్, ఫుట్‌వేర్ నాణ్యతను గుర్తించేలా చేయడానికి పరీక్షలు చేసి నివేదిక ఇస్తాం. వీటి ద్వారా వచ్చే నిధులను సంస్థ అభివృద్ధికి, కొత్త సౌకర్యాలకు వినియోగిస్తాం. 100 శాతం అడ్మిషన్లు, ఫలితాలు, ప్లేస్‌మెంట్స్ ప్రధాన లక్ష్యం.

– ఎక్బాల్‌హుస్సేన్, ప్రిన్సిపల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ, రాయదుర్గం

కిటకిటలాడిన ఆలయాలు



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో..

రాయదుర్గం: నూతన సంవత్సరంను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. అలాగే జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, గచ్చిబౌలి శివసాయిక్షేత్రం, రాయదుర్గంలోని నర్సింహ్మస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, ఊరపోచమ్మ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, ఇతర ఆలయాలు, గోపన్‌పల్లి, నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం, గౌలిదొడ్డిలోని శివాలయం, మధురానగర్, సాయిఐశ్వర్య, సాయివైభవ్ కాలనీలలోని ఆలయాల్లో పూజలు చేశారు. కాగా టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 కేలండర్‌ను ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు వివివిఎస్ శర్మ, ప్రసాద్, శర్మ ఆవిష్కరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు కేలండర్‌లను పంపిణీ చేశారు.



గణేష్‌గడ్డలో..

గణేష్‌గడ్డ దేవస్థానంలో..

పటాన్‌చెరు టౌన్: నూతన సంవత్సరం నేపథ్యంలో రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప మాట్లాడుతూ... ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతుందని ఆలయ జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు.

గోదాదేవికి సారె సమర్పణ



మోతీనగర్: గోదాదేవి పుట్టినరోజు తిరు నక్షత్రం సందర్భంగా సోమవారం సారె సమర్పించారు. విష్ణు, లలితా సహస్ర భక్త బృందం దుర్గమ్మ పోచమ్మ నాగదేవత ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లారు. వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, కమిటి సభ్యులు శ్రీనివాస్, బొంత హరికృష్ణ, ఆవుల ఆంజనేయులు, ప్రసన్నాంజనేయులు, రాజేశ్వరి, సుజాత, వరలక్ష్మీ, నాగ వరలక్ష్మీ, లక్ష్మీ ప్రమీల పాల్గొన్నారు.

జాతీయ పోటీలలో ప్రతిభ చాటిన ఆదిత్య



పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ (సీఎస్‌బీఎస్) ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదిత్య జాతీయ పోటీలలో ప్రతిభ చాటాడు.నవీ ముంబైలోని ఉరాన్‌లో ఇటీవల జరిగిన 44వ ఓపెన్ నేషనల్ డెడ్ లిఫ్ట్ ఛాంపియన్‌షిప్ లో కాంస్య పతకాన్ని సాధించారు. విజయాన్ని అందుకున్న ఆదిత్యను గీతం ఉన్నతాధికారులు, కోచ్‌లు, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



శ్రీరాముని అక్షింతలతో భక్తులు, స్థానికులు

రాయదుర్గం: రాయదుర్గంలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను ఊరేగించారు. స్థానిక లక్ష్మీ నర్సింహ్మస్వామి ఆలయంలో అక్షింతలుంచి పూజల అనంతరం ఊరేగించారు. శ్యామ్‌లెట్ వీధిలో అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామారావు, నిఖిల్, గణేష్, పాండు, ఉపేందర్, సంజీవ, సూర్యప్రకాశ్, జగదీష్ పాల్గొన్నారు.



అడ్డగుట్ట వెస్ట్రన్‌హిల్స్‌లో..

భాగ్యనగర్ కాలనీ: అయోధ్య మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఇంటింటికీ అక్షింతలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం సమతానగర్ వాలంటీర్లు పలు కాలనీల్లో అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు శివప్రసాద్, జ్ఞానేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. జనవరి 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు.

అసోసియేట్ ఎడిటర్‌గా ప్రొ. గణపతి వైతీశ్వరన్



రాయదుర్గం: బులెటిన్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గణపతి వైతీశ్వరన్‌ను ఆహ్వానించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లో ప్రొఫెసర్ అయిన గణపతి వైతీశ్వరన్ 2024 జనవరి నుంచి డిసెంబర్ 2026 వరకు ఎడిటోరియల్ బోర్డ్‌లో అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేస్తారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

శుభాకాంక్షలు



ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును సత్కరించిన జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: నూతన సంవత్సరంను పురస్కరించుకొని రాష్ట్ర మంత్రులను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ కలిశారు. రాష్ట్ర సచివాలయంలో రంగారెడ్డిజిల్లా ఇన్‌చార్జీ మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబును, బీసీ సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



కేబీఆర్ పార్కు వద్ద కొత్వాల్...

బంజారాహిల్స్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేబీఆర్ పార్కు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పోలీసు అధికారులకు, సిబ్బందికి, నగర పౌరులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరి ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.



పెద్దమ్మ టెంపుల్‌లో..

బంజారాహిల్స్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో దర్శనాల కోసం భక్తులు బారులుదీరారు. పెద్ద సంఖ్యలో వచ్చేసిన భక్తజన సందోహంతో ఆలయ ప్రాంగణాలతో పాటు పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భారీగా భక్తులు విచ్చేయడంతో ఆలయ వర్గాలు లఘు దర్శనం ఏర్పాటు చేశాయి. అమ్మవారిని నూతన సంవత్సరం సందర్భంగా సుమారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

టీటీడీ దేవాలయంలో...

జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామివారిని సుమారుగా 60 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. టీటీడీ టెంపుల్ భక్త జనసందోహంతో కిటకిటలాడాయి. పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మికతతో వెల్లివిరిశాయి.

◆ పంజగుట్ట ద్వారకాపురి కాలనీలో కొలువుదీరిన శ్రీ సాయిబాబా దర్శనానికి భక్తులు భారీగా విచ్చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 1/12 చౌరస్తాలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి దర్శనం కోసం భక్తులు భారీగా విచ్చేసి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

డబుల్ కల నెరవేరేనా?



జిన్నారంలో నిలిచిపోయిన పనులు

- అర్ధంతరంగా ఆగిపోయిన ఇళ్ల పనులు
- పట్టించుకోని అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): పేదల డబుల్ ఇళ్ల కల ఇప్పట్లో నెరవేరేటట్టు లేదు. పనులు ప్రారంభమై నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. జిన్నారం మండలంలోని కొడకంచి, జిన్నారం గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసి ఐదేళ్లవుతుంది. కొడకంచి గ్రామంలో శ్లాబుల వరకు పనులు జరిగాయి. మండల కేంద్రమైన జిన్నారంలో రూ. 3కోట్లతో నిర్మించనున్న డబుల్ ఇళ్ల పనులు పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. దీంతో ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. 2019లో పనులు ప్రారంభమైనా ప్రస్తుతం ఎలాంటి పురోగతి లేదు. జిన్నారంలో సుమారు వందమంది వరకు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. డబుల్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిలోనే ఆగిన పనులు

ఆదిలోనే డబుల్ ఇళ్ల నిర్మాణ పనులు ఆగిపోయినా గత అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో నిరుపేదలకు న్యాయం జరుగుతుంది. ఇళ్ల పనులకు సంబంధించి ఉన్నతాధికారులు, ప్రభుత్వంతో చర్చించేలా మావంతు కృషి చేస్తా.

– ఎంపీపీ రవీందర్‌గౌడ్, జిన్నారం

న్యూ ఇయర్ వేడుకలు.. ఎమ్మెల్యేకు సన్మానం

పటాన్‌చెరు: నూతన సంవత్సరంను పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ పార్క్ హోమ్స్, ఏపీఆర్ ప్రవీణ్ లగ్జరియా హోమ్స్ కాలనీలలో సోమవారం ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్షలు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, సుధాకర్, కాలనీల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో..



కేక్ కట్ చేస్తున్న వృద్ధులు

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సోమవారం హోం ఫర్ ఏజ్డ్, పెద్దల ఆశ్రమంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ చెన్నకేశవరావులు వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు, డాక్టర్ బుర్రి రంగారెడ్డి, హోమ్ కమిటి సభ్యులు డాక్టర్ పి.సరస్వతి, రాజేంద్రరావు, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి డాక్టర్ విజయలక్ష్మి, సుబ్బరామన్, పల్ల విజయ, జోస్యభట్ల కల్పన, పరుచూరి జమున, డాక్టర్ మండల గోపిచంద్, కంభంపాటి విజయ, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్‌లో జనచైతన్య ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలోని నూతన సంవత్సర కేలండర్‌ను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆవిష్కరించారు. గోపీనగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పసునూరి రవీందర్, జనచైతన్య ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు జి.నర్సింహ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్స్ తలారి నర్సింలు, ముసలయ్య, గోపీనగర్ బీఆర్ఎస్ బస్తీ కమిటీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, రాజుకుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కీ అభివృద్ధికి కృషి చేస్తాం



రాయదుర్గం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(‘ఎస్కీ’)లో వేడుకలు నిర్వహించారు. ఎస్కీ అభివృద్ధికి కృషి చేస్తామని, కస్టమర్ సేవలను అందించేలా చూస్తామని ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎస్ లక్ష్మీకాంతరావు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీలో ఈ ఏడాది టెక్నో హబ్‌ని ప్రారంభిస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్బిట్రేషన్‌లో సర్టిఫికేట్ కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పటాన్‌చెరు టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు.ఆదివారం రాత్రి స్పెషల్ డ్రంకన్ డ్రైవ్‌ను పటాన్‌చెరు బస్టాండ్, ముత్తంగి రింగ్‌రోడ్, ఇస్నాపూర్ చౌరస్తాలో మూడుచోట్ల నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 15 ద్విచక్ర వాహనాలు, ఒక కారును సీజ్ చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపిన 16 మందిపై కేసు నమోదు చేశారు.

లిఫ్ట్ గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాదాపూర్: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మరణించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్ చంద్రనాయక్‌తండా ఎస్ కన్వెన్షన్ దగ్గర్లో నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్ట్ గుంతలో గుర్తు తెలియని వ్యక్తి పడి చనిపోయాడు. మాదాపూర్ క్లూస్‌టీం సహాయంతో శవాన్ని బయటికి తీశారు. వయస్సు 40 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. బ్లాక్‌కలర్ ప్యాంట్, బ్లాక్ కలర్ స్వెటర్, రెడ్‌కలర్ టీషర్టు, పారగాన్ చెప్పులు ధరించి ఉన్నాడు. ఎత్తు 5.2. జేబులో సగం తాగిన మద్యం బాటిల్ ఉంది. మద్యం సేవించి అర్ధరాత్రి సమయంలో లిఫ్ట్‌గుంతలో పడి చనిపోయినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8712568360, 9490617182లలో సంప్రదించాలని కోరారు.

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

మూసాపేట: భగీచసింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కిషోర్‌కుమార్ పోలాకి ఆధ్వర్యంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా అభాగ్యులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ పోలాకి మాట్లాడారు. నగరంలో చలి తీవ్రత బాగా పెరగడం వల్ల హైదరాబాద్ నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లపై పడుకునే అభాగ్యులు, పేదవారు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వారిని వెంటనే షెల్టర్ జోన్‌లకు తరలించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుల గణేష్‌రెడ్డి, కుమార్ నాయక్, కొల్లి వెంకట్,ఫౌండేషన్ సభ్యులు రట్టి భీమరాజు, కె.మురళి, రట్టి గజపతి, రేగాల తమ్మినాయుడు, రట్టి నవీన్, రట్టి సాయిరాం, రట్టి రాజు పాల్గొన్నారు.

ధరిత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మోతీనగర్: నూతన సంవత్సరం సందర్భంగా ధరిత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. చీర్స్ ఫౌండేషన్ నిర్వాహకులు కైత్లాపూర్, అమీర్‌పేట, ఖైరాతాబాద్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. ధరిత్రి ఫౌండేషన్ ద్వారా పేదలు, అనాథలకు సేవ చేయటం చాలా సంతృప్తి, ఉత్తేజాన్ని కలిగిస్తుందని తెలిపారు.